పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
ఆంధ్రజ్యోతి చిరునామా : జి4, గ్రౌండ్ ఫ్లోర్, రామ్స్ అపార్ట్‌మెంట్, ఓల్డ్ నెం. 40, న్యూ నెంబర్ 35, విజయ రాఘవ రోడ్డు, టి.నగర్, చెన్నై - 600 017

ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి తమిళ నేత సీపీ రాధాకృష్ణన్



చెన్నై, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైన బీజేపీ సీనియర్ నేత సీపీ రాధాకృష్ణన్ పార్టీలోని అన్ని వర్గాలను కలుపుకుని సఖ్యతగా మెలిగే నాయకుడిగా పేరుగడించారు. సౌమ్యుడు, స్నేహశీలి అని ఆయన మిత్రులు చెబుతుంటారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకుని బీజేపీలో చేరి ఆ పార్టీకి సేవలందించారు. ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్ వ్యవహరిస్తున్న సీపీ రాధాకృష్ణన్ పూర్తి పేరు చిదంబరం పొన్నుసామి రాధాకృష్ణన్. తమిళనాడులోని తిరుప్పూరులో 1957 అక్టోబర్ 20న జన్మించారు. బాల్యంలోనే ఆర్‌ఎస్‌ఎస్, జనసంఘ్‌పై ఆసక్తిని పెంచుకుని సునిశిత కార్యకర్తగా ఎదిగారు. 1998, 1999లో వాణిజ్య నగరం కోయంబత్తూరు లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ తరఫున పోటీ చేసి గెలిచారు. 2004, 2014, 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2004-07 మధ్య బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలందించారు. ఆ సమయంలోనే పార్టీని అభివృద్ధి చేసేందుకు కన్నియాకుమారి నుంచి చెన్నై దాకా పాదయాత్ర నిర్వహించారు. బీజేపీ జాతీయ నాయకులతో ఆయన సఖ్యతగా మెలుగుతుంటారు. అధిష్ఠానం పదవులు ఇచ్చినా, ఇవ్వకపోయినా నిర్మలంగా వ్యవహరించేవారు. అదే సమయంలో పదవి ఇస్తే చక్కగా నిర్వర్తించే వారు. తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాలకు గవర్నర్‌గా అదనపు బాధ్యతలు కూడా నిర్వర్తించారు.

గవర్నర్‌ రవి చౌకబారు రాజకీయాలు!



ధర్మపురి సభలో ఓ మహిళకు పంట రుణాన్ని చెక్కురూపంలో అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

- ప్రభుత్వంపై నిందలు మోపడం ఆయన పని
- ధర్మపురి సభలో సీఎం స్టాలిన్ ధ్వజం
- దరఖాస్తు చేసిన రోజే రైతులకు పంట రుణం
- కొత్త పథకానికి శ్రీకారం

చెన్నై, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ తరహా డీఎంకే పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుండడాన్ని చూసి ఓర్వలేకే రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి చౌకబారు రాజకీయాలకు పాల్పడుతున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధ్వజమెత్తారు. ధర్మపురి జిల్లా ఆదియమాన్‌కోటలో ఆదివారం ఉదయం జరిగిన కార్యక్రమంలో సహకార సంఘాల ఆధ్వర్యంలో రైతులు అంతర్జాలం ద్వారా దరఖాస్తు చేసుకున్న రోజే పంట రుణాలిచ్చే ప్రత్యేక పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... ప్రభుత్వంపై అదేపనిగా నిందలు మోపడమే పనిగా గవర్నర్ పెట్టుకున్నారని, ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయంటూ గగ్గోలు పెడుతున్నారని మండిపడ్డారు. ధర్మపురిలో జరిగే కార్యక్రమంలో పాల్గొనడానికి శనివారం సాయంత్రం సేలం నుంచి రోడ్డు మార్గంలో చేరుకున్న సీఎం ఒట్టపట్టిలో కేంద్ర మాజీ మంత్రి మురసొలిమారన్ 92వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత ఆదియమాన్‌కోటలో ఏర్పాటైన సభలో పంట రుణాల ప్రత్యేక పథకాన్ని ప్రారంభించారు. ఆదియమాన్‌కోట, బాల జంగమనహళ్ళి సహకార వ్యవసాయ సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్న ఐదుగురు రైతులకు వడ్డీ లేని పంట రుణాలను ఆయన పంపిణీ చేశారు.

పలు పథకాలకు శంకుస్థాపన...

నల్లపళ్ళి యూనియన్ తడంగం పట్టణ పంచాయతీ పీఎంబీ కళాశాల వద్ద ఏర్పాటైన సభలో రూ.512.52 కోట్లతో చేపట్టనున్న పథకాలకు శంకుస్థాపన చేశారు. రూ.362.77 కోట్లతో పూర్తయిన పథకాలను ప్రారంభించారు. రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి, బీసీలు, మైనార్టీల సంక్షేమ శాఖ, ఆదిద్రావిడులు, గిరిజనులు, మైనార్టీల సంక్షేమ శాఖల కింద 70,427 మంది లబ్ధిదారులకు రూ.830.06 కోట్లను అందజేశారు. ఈ సందర్భంగా స్టాలిన్ ప్రసంగిస్తూ... తాను ప్రారంభించి మహిళలకు వెలుగుబాట (ఉచిత) ప్రయాణ పథకాన్ని పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లలో అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ పథకం ప్రారంభించి యాభై నెలలైందని, మహిళలు ఇప్పటి వరకు రూ.50వేల దాకా పొదుపు చేశారన్నారు. ఇదే తరహాలో కలైంజర్ మహిళా సాధికారిక నగదు పథకం ద్వారా గృహిణులు ప్రతి నెలా రూ.1000 పొందుతున్నారని, మహిళల స్వయం సంవృద్ధికి ఇంతకు మించిన ఆధారాలు ఏముంటాయని ప్రశ్నించారు.

చౌకబారు రాజకీయాలు...

అభివృద్ధిని చూసి ప్రతిపక్షపార్టీలు నిందలు వేస్తే సమాధానం చెప్పగలమని, అయితే వీరందరిని మించి చౌకబారు రాజకీయాలు చేసే వ్యక్తి ఒకరున్నారని, ఆయనెవరో ప్రజలందరికీ బాగా తెలుసునని, ఆయనే డీఎంకే ప్రభుత్వ ప్రగతికి అడ్డుపుల్ల వేయడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియమించిన గవర్నర్ ఆర్‌ఎన్ రవి అని అన్నారు. రాజ్‌భవన్‌లో ఉంటూ రోజు డీఎంకే ప్రభుత్వంపై నిందలు మోపుతారని, శాసనసభ ఆమోదించి పంపిన బిల్లులు గురించి పట్టించుకోరన్నారు. ఇక ప్రపంచంలో ఎక్కడా లేని తిరుక్కురళ్ సూక్తిని కొత్తగా సృష్టించి ముద్రించి అందరికీ కరపత్రాలు పంచిపెడతారన్నారు. తమిళతల్లి ప్రార్థనను అవమానిస్తారని, రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలపై అసత్య ఆరోపణలు చేస్తుంటారని, వీటన్నింటినీ చెప్పి ప్రజలలో లేనిపోని భయాందోళనలు కలిగించేందుకు ప్రయత్నిస్తుంటారని స్టాలిన్ విమర్శించారు.

కేంద్రప్రభుత్వం కితాబు...

దేశంలోనే అన్ని రంగాలలో అభివృద్ధి చెందిన రాష్ట్రం తమిళనాడేనని కేంద్ర ప్రభుత్వమే కితాబిచ్చిందని, ఈ విషయం కూడా తెలియని గవర్నర్ రాష్ట్రం అన్ని రంగాలలో వెనుకబడిందని, శాంతి భద్రతలు క్షీణించాయని, విద్యలో వెనుకబడిందని ఆరోపించడం గర్హనీయమన్నారు. రెండు వారాల వ్యవధిలో 'ఉంగలుడన్ స్టాలిన్', 'నలంకాక్కుం స్టాలిన్', 'తాయు మానవర్' పథకాలను ప్రారంభించామని, వాటి ప్రజాస్పందనను చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారని తెలిపారు. ఇక ధర్మపురి జిల్లాకు కూడా ఐదువరాలను ప్రకటిస్తున్నానన్నారు.

- చిత్తేరి పంచాయతీ పరిధిలో కొండ ప్రాంతాలైన కొల్లకంబట్టి, చిన్నాంగుప్పం, గోపిశెట్టిపాళయం తదితర గ్రామాల గిరిజనులు పాపిరెడ్డిపట్టి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాలంటే కొన్ని మైళ్ల పర్యంతం నడవాల్సి ఉందని, ఈ కష్టం నుంచి వారికి విముక్తి కల్పించేందుకు త్వరలో ఆరూరు వద్ద తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.
- హొగెనేకల్ - ధర్మపురి మధ్య ఉన్న జిల్లాస్థాయి రహదారిని ఫోర్‌వేగా మార్చేందుకు రూ.165 కోట్లు కేటాయిస్తున్నామని, నల్లంపల్లి పంచాయతీ యూనియన్‌లోని పరిగమ్ నుంచి మలయూరు వరకు ఉన్న అటవీ శాఖ రహదారిని రూ.10కోట్లతో తారు రోడ్డుగా మార్చనున్నామని తెలిపారు.
- చింతపండును అధికంగా పండించే ధర్మపురి రైతుల సంక్షేమార్థం రూ.11.30 కోట్లతో ప్రత్యేక వాణిజ్య కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు.
- ఆరూరు నగర పంచాయతీ ప్రజల కోసం రూ.15 కోట్లతో సమగ్ర తాగునీటి పథకాన్ని అమలు చేస్తామని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు ఈవీ వేలు, ఎంఆర్కే పన్నీర్‌సెల్వం, పెరియకరుప్పన్, రాజేంద్రన్, ఎంపీ మణి, శాసనసభ్యుడు వెంకటేశ్వరన్, మాజీ మంత్రి పళనియప్పన్, ధర్మపురి జిల్లా కలెక్టర్ సతీష్, వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో సామాన్య భక్తులకే పెద్దపీట

- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు
- తెలుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘన సత్కారం





టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని గజమాలతో సత్కరిస్తున్న విద్యావేత్త ఆర్ఎస్ మునిరత్నం, వి.అనంతరామన్

ప్యారీస్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి కొలువై ఉన్న పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలలో సామాన్య భక్తులకు శీఘ్ర దర్శనంతో పాటు వసతులు కల్పించామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. తెలుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమింజికరైలోని అయ్యావు మహల్‌లో ఆదివారం సాయంత్రం బీఆర్ నాయుడిని పలు తెలుగు సంఘాలు, ఉన్నత విద్యాసంస్థలు, మాజీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, న్యాయమూర్తులు, కళాకారుల సమక్షంలో ఘనంగా సత్కరించారు. ఫౌండేషన్ చైర్మన్ వి.అనంతరామన్ ఏర్పాటు చేసిన ఈ సభలో టీటీడీ చెన్నై పాలక మండలి మాజీ అధ్యక్షుడు ఏ.జే.శేఖర్, ఆర్ఎంకే విద్యాసంస్థల చైర్మన్ ఆర్ఎస్ మునిరత్నం, ఆర్ఎం.కిశోర్, జయ విద్యాసంస్థల చైర్మన్ ఎ.కనకరాజ్, ఎమ్మెల్యేలు కడంబూరు రాజు, ఎంకే మోహన్, బీజేపీ నాయకుడు ఎం.చక్రవర్తి, జస్టిస్ ఎస్.గోకుల్‌దాస్, మహర్ వర్శిటీ ఛాన్సలర్ జయంతి రాధాకృష్ణన్, తమిళనాడు మాజీ ప్రధాన కార్యదర్శి పి.రామ్మోహన్‌రావు, మాజీ డీజీపీ ఆర్.శేఖర్, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, బెజవాడ వెంకటరావు, డాక్టర్ ఎం.రాజారామ్, తమిళనాడు కమ్మనాయుడు సంఘం అధ్యక్షుడు తాళ్లూరు సురేష్, టీడీపీ చెన్నై ప్రెసిడెంట్ చంద్రశేఖర్, ఎస్ఎం సిల్క్స్ అధినేత మనోహర్, ఆస్కా మాజీ అధ్యక్షుడు మాదాల ఆదిశేషయ్య, ఆంధ్ర కళాస్రవంతి అధ్యక్షుడు జే.ఎం. నాయుడు, మద్రాస్ హైకోర్టు న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు జి.మోహన్‌కృష్ణన్ తదితర ప్రముఖులు హాజరై బీఆర్ నాయుడికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కార్యక్రమంలో మాట్లాడిన పలువురు వక్తలు బీఆర్ నాయుడు ఆధ్యాత్మిక బాంధవ్యుడని, శ్రీవారి భక్తుల మనోభావాలను గౌరవించి తిరుమలలో ఉత్తమ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. శ్రేయ ఫౌండేషన్ ద్వారా వందలాది మంది చిన్నారులకు శస్త్రచికిత్సలు ఉచితంగా చేయించి మానవతను చాటుకున్నారని, ఆయనకు వెనుకడుగు వేసేది తెలియదన్నారు. సత్కారం అందుకున్న సందర్భంగా బీఆర్ నాయుడు సభనుద్దేశించి మాట్లాడుతూ... తెలుగు ఫౌండేషన్ ఆహ్వానం మేరకు టీటీడీ చైర్మన్ హోదాలో మొట్టమొదటి సారిగా చెన్నైకి వచ్చి తెలుగు ప్రజల సమక్షంలో సత్కారం అందుకోవడం, పలు రంగాలకు చెందిన ప్రముఖులతో వేదిక పంచుకోవడం శ్రీవారి భాగ్యమన్నారు. చిత్తూరు జిల్లాలోని ఓ చిన్న గ్రామంలో జన్మించిన తనకు ఈ స్థాయికి రావడం వేంకటేశ్వరస్వామి లీల అని అన్నారు. తాను నెలలో 20రోజులు తిరుమలలో ఉంటూ భక్తులకు వసతులు కల్పిస్తున్నానని, భోజనం, లడ్డూ తయారీలో నాణ్యత పెంచామని, ప్రస్తుతం రోజుకు 80 వేల మంది దర్శించుకుంటున్నారని, వీఐపీల దర్శనాన్ని తగ్గించామన్నారు. సామాన్య, పాదయాత్ర భక్తులు ఎక్కువ సమయం క్యూలైన్లలో వేచి ఉండకుండా శీఘ్ర దర్శనం కల్పించేలా త్వరలో ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్‌ను హెచ్‌సీఎల్ సహకారంతో అమలుపరచనున్నట్లు తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు పాలనలో ఎక్కడా అవినీతికి తావులేదని, ఈ క్రమంలో తిరుమలలో బ్రోకర్ల ప్రమేయంలేకుండా చేశామన్నారు. తెలుగు ఫౌండేషన్ చైర్మన్ అనంతరామన్ ఆహ్వానం అందుకుని ఇంత మంది తెలుగువారు తరలిరావడం సంతోషంగా ఉందన్నారు. ముందుగా వేదిక ప్రాంగణానికి విచ్చేసిన బీఆర్ నాయుడును వేదపండితులు పూర్ణకుంభంతో ఆహ్వానించగా వేదికపై టీటీడీ చెన్నై సమాచారం కేంద్ర అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారందరికీ శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

సర్వాధికారాలూ రాందాస్‌కే

- పీఎంకే సర్వసభ్యమండలి నిర్ణయం
- 37 తీర్మానాలకు ఆమోదం
- అన్బుమణిపై 16 ఆరోపణలు



పీఎంకే సర్వసభ్య మండలిలో పాల్గొన్న రాందాస్, ఆయన కుమార్తె కాంతిమతి, ఎమ్మెల్యే జీకే మణి తదితరులు

చెన్నై, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి అధ్యక్షుడిగా డాక్టర్ రాందాస్ ఎంపికయ్యారు. పార్టీ వ్యవస్థాపకుడిగా ఆయనే వ్యవహరించనున్నారు. ఆ మేరకు ఆదివారం ఉదయం రాందాస్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సర్వసభ్యమండలి సమావేశంలో తీర్మానించారు. విల్లుపురం జిల్లా పట్టానూరు సమీపంలో ఉన్న సంఘమిత్ర హాలులో జరిగిన ఈ సమావేశంలో రాందాస్ వర్గానికి చెందిన పార్టీ కార్యనిర్వాహక సభ్యులు, సర్వసభ్యమండలి సభ్యులు హాజరయ్యారు. అదే సమయంలో పార్టీని చీల్చేందుకు డాక్టర్ అన్బుమణి రాందాస్ ప్రయత్నిస్తున్నారంటూ సభలో ప్రసంగించిన పార్టీ గౌరవాధ్యక్షుడు జీకే మణి సహా పార్టీ ప్రముఖులు విమర్శించారు. పార్టీ క్రమశిక్షణ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ... అన్బుమణి పార్టీకి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారనంటూ ఆయనపై 16 రకాల ఆరోపణలు చేశారు. ఇకపై పార్టీపై సర్వాధికారాలు రాందాస్‌కే అప్పగిస్తూ ఈ సమావేశంలో ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించారు. వచ్చే యేడాది అసెంబ్లీ ఎన్నికల పొత్తు విషయంలోనే నిర్ణయం తీసుకునే అధికారాన్ని కూడా రాందాస్‌కే అప్పగించారు. వన్నియార్లకు 10.5 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు రాందాస్ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం జరపాలని నిర్ణయించారు. డీఎంకే ప్రభుత్వం కులాలవారీ జనగణన జరపాలని కోరుతూ తీర్మానం చేశారు.



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

కాంతిమతికి అగ్రస్థానం...

ఈ సమావేశంలో రాందాస్ కుమార్తె కాంతిమతికే పార్టీ ప్రముఖులు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. సమావేశం హాలు ప్రవేశద్వారం నుంచి పార్టీ శ్రేణులు ఆమెకు ఇరువైపులా నిలిచి వేదికపైకి తీసుకెళ్లారు. రాందాస్ పక్కనే కాంతిమతి కూర్చున్నారు. సమావేశం జరుగుతుండగా ఇరువురూ ఏదో విషయమై మాట్లాడుతూ గడిపారు. కాంతిమతి కుమారుడైన ముకుందన్‌కు పార్టీ యువజన విభాగం అధ్యక్ష పదవిని కట్టబెట్టేందుకు రాందాస్ చేసిన ప్రయత్నాన్ని సహించలేకే అన్బుమణి తండ్రికి దూరమయ్యారు. పార్టీ కార్యాలయాన్ని పనయూరుకు మార్చారు. ఇటీవలే అన్బుమణి సర్వసభ్యమండలి సమావేశాన్ని జరిపారు. ఆ సమావేశంలో వందమందికిపైగా సర్వసభ్య మండలి సభ్యులు ఆయన్ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో అన్బుమణిపై పోటీపడేలా రాందాస్ ఆదివారం సర్వసభ్యమండలి సమావేశాన్ని జరిపి తన బలాన్ని నిరూపించారు. ఈ సమావేశంలో పీఎంకే గౌరవాధ్యక్షుడు జీకే మణి... అన్బుమణిపై తీవ్ర విమర్శలు చేశారు. పార్టీ వ్యవస్థాపకుడు రాందాస్‌ను అన్బుమణి అన్ని విధాలా మానసిక క్షోభను కలిగించారని ఆరోపించారు.

అన్బుమణిపై ఆరోపణలు...

ఈ సమావేశంలో పార్టీ క్రమశిక్షణా కమిటీ సభ్యులు సమర్పించిన నివేదిక ప్రకారం అన్బుమణి 16రకాల తప్పిదాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. గత యేడాది డిసెంబర్‌లో జరిపిన పార్టీ సమావేశంలో అన్బుమణి మైకును విసిరిగొట్టి, పనయూరులో కొత్తగా పార్టీని ప్రారంభించారని, పార్టీ శ్రేణులు అక్కడికే రావాలని ప్రకటించి పార్టీలో చీలికకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. మే నెలలో జరిగిన మహానాడు తర్వాత తైలాపురంలో రాందాస్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యదర్శుల సమావేశంలో వందమంది కార్యదర్శులను పాల్గొనకుండా అడ్డుకున్నారని, పార్టీ ప్రచార విభాగం నిర్వాహకులను మభ్యపుచ్చి పార్టీ నేతలపై తప్పుడు సమాచారాలు వ్యాపింపచేశారన్నారు. తైలాపురంలో రాందాస్ పడక సమీపంలోనే సీక్రెట్ వాయిస్ రికార్డర్ పెట్టారని, రాందాస్ అనుమతి లేకుండా సర్వసభ్యమండలి సమావేశం జరుపటం పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమని, పార్టీకి చెందిన 'మక్కల్ తొలైకాట్చి' (టీవీ చానెల్)ను హస్తగతం చేసుకుని రాందాస్‌కు సంబంధించిన వార్తలు ప్రసారం కాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపణలు చేశారు.



ప్లకార్డ్ కలకలం...

ఈ సర్వసభ్యమండలి సమావేశంలో పార్టీ శ్రేణులు అన్బుమణిని యెద్దేవా చేసేలా ఆంగ్ల భాషలో ముద్రించిన ప్లకార్డులు ప్రదర్శించారు. ఆ ప్లకార్డులలో 'ఇఫ్ యూ ఆర్ బ్యాడ్... ఐ యామ్ యువర్ డాడ్' అని ముద్రించి ఉంది. పార్టీలో ఆధిపత్యం కోసం తండ్రీ తనయుల మధ్య జరిగే సమయంలో తండ్రిదే గెలుపు అనే భావం స్ఫురించే రీతిలో ఈ ప్లకార్డ్ ఉండటం విశేషం. ఏదిఏమైనప్పటికీ ఈ ప్లకార్ కలకలం సృష్టించింది.

యావత్ తెలుగు జాతికి కృష్ణుడంటే ఎన్టీఆర్

- ఏపీ ఉప సభాపతి రఘురామ కృష్ణరాజు
- ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



సినీనటి లయను సత్కరిస్తున్న నిర్వాహకులు

అడయార్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా యావత్ తెలుగు జాతికి ఒకే రాముడు, ఒకే కృష్ణుడు దివంగత నందమూరి తారక రామారావు మాత్రమేనని ఏపీ అసెంబ్లీ ఉప సభాపతి రఘురామ కృష్ణరాజు అన్నారు. శ్రీ కళా సుధ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక ఆళ్వార్‌పేటలోని టీటీకే సాలైలో ఉన్న మ్యూజిక్ అకాడమీలో జరిగిన ఈ వేడుకలు ప్రార్థనా గీతం, జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఏపీ అసెంబ్లీ ఉప సభాపతి రఘురామ కృష్ణరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... తెలుగు ప్రజలందరికీ ఎన్టీఆర్ దేవుడుతో సమానమన్నారు. నిజమైన దేవుడు వచ్చి తానే శ్రీకృష్ణుడు అని చెప్పినా ఎవరూ నమ్మరని, అంతలా తెలుగువారి గుండెల్లో ఆయన నిలిచిపోయారన్నారు. ఎన్టీఆర్ రాజకీయాల్లో ఉన్నప్పటికీ తెలుగు భాషకు విశేష కృషి చేశారన్నారు. గత ప్రభుత్వంలో తెలుగు భాషకు అన్యాయం జరిగిందని, గత ప్రభుత్వ పాలకుల తప్పులను సరిదిద్దుతూ ప్రస్తుత ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. తెలుగు భాష పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ... బేతిరెడ్డి శ్రీనివాస్ అనే వ్యక్తి ఒక సంస్థను 27 యేళ్లుగా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఆయన చెన్నై మహానగరంలో తెలుగు భాష, సాంస్కృతిక కళలను పరిరక్షిస్తున్నారన్నారు. వివిధ రంగాలకు చెందిన అనేక మంది ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి సన్మానించడం హర్షణీయమన్నారు. భాష నశిస్తే ఒక జాతి అంతరించిపోతుందన్నారు. అందువల్ల త్వరలో చేపట్టే జనాభా గణనలో చెన్నైలోని తెలుగు వారంతా తమ మాతృభాష తెలుగని, తాము తెలుగు ప్రజలమని చెప్పి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. సినీ నటి నమిత మాట్లాడుతూ... తన జీవితంలో మార్పులకు ఇస్కాన్ కారణమని చెప్పారు. సినీ నిర్మాత గూడూరు నారాయణ రెడ్డి మాట్లాడుతూ... ఉగాది పురస్కారాల్లో తాను నిర్మించిన 'రజాకార్' చిత్రానికి ఇదే వేదికపై అవార్డును అందుకున్నానని గుర్తుచేశారు. యావత్ ప్రపంచానికి భగవద్గీత, సనాతన ధర్మమే మూలమన్నారు. ఈ ధర్మంలోని మంచి విషయాలను సేకరించి అన్యమతస్థులు వారి పవిత్ర గ్రంథాలుగా రూపొందించుకున్నారన్నారు. మన మతానికి ప్రమాదం పొంచివుందని, ఇది యువత గుర్తెరిగి నడుచుకోవాలని పిలుపునిచ్చారు. తాను కరుడుగట్టిన కాంగ్రెస్ వాదినని, అయితే, ఆ పార్టీ వల్లే మన దేశానికి అపారనష్టం జరిగిందని గ్రహించి రాజీనామా చేసి బీజేపీలో చేరానన్నారు. ఆ తర్వాత బెల్లంకొండ కృష్ణమూర్తి, నూతలపాటి శ్రీకృష్ణ, వినయ్ భాయ్ పత్రాలె, వైకుంఠం ప్రభాకర చౌదరి, సినీ నటి లయ తదితరులు ప్రసంగించారు. ముందుగా ఢిల్లీకి చెందిన కర్ణాటక క్లాసికల్ సంగీత కళాకారిణి శ్వేత మంగళంపల్లి బృందం నాదార్పణం, ఆ తర్వాత అమెరికాకు చెందిన ఎస్ఎస్ శశాంక భక్తిగీతాలాపనలు చేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు చెందిన సుజరిత, సుప్రజ బృందం కూచిపూడి నృత్యం ఆహూతులను అమితంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో స్వాగత ఉపన్యాసం బేతిరెడ్డి శ్రీనివాస్ చేయగా, ప్రముఖ సినీ నేపథ్యగాయకుడు మనో, డాక్టర్ సగిలి సుధారాణి సభానిర్వహణ చేశారు. ఈ వేడుకలతో పాటు శ్రీ కళా సుధ తెలుగు అసోసియేషన్ 27వ వార్షిక వేడుకలను కూడా నిర్వహించారు.

డిజిటల్ యుగంలో పుస్తక రచన గొప్పసాహసం

వేద విజ్ఞాన వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి ● ఘనంగా శ్రీ కనకదుర్గా శతకం పుస్తకావిష్కరణ సభ



శ్రీ కనకదుర్గా శతకం పుస్తకావిష్కరణ సభలో జేకే రెడ్డి, మన్నవ గంగాధర ప్రసాద్, నిర్మలా పళనివేలు తదితరులు

ప్యారీస్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం అత్యంత వేగంగా పెరుగుతున్న నేటి డిజిటల్ యుగంలో పుస్తక రచన గొప్ప సాహసమని, అందులోనూ శ్రీ కనకదుర్గమ్మను స్తుతిస్తూ సీనియర్ పాత్రికేయుడు డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్ శతకం రాయడం అభినందనీయమని వేద విజ్ఞాన వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి పేర్కొన్నారు. మైలాపూర్‌లోని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో ఆదివారం 10 గంటలకు జనని సాంఘిక, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మన్నవ గంగాధర ప్రసాద్ రచించిన శ్రీ కనకదుర్గా శతకం పుస్తకావిష్కరణ జరిగింది. కిడాంబి లక్ష్మీకాంత్ ప్రార్థనా గీతంతో ప్రారంభమైన ఈ సభలో జనని వ్యవస్థాపకుడు, ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య స్వాగతోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 32యేళ్లుగా ఇలాంటి కార్యక్రమాలను పలువురు దాతల సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తూ తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. జనని అధ్యక్షురాలు నిర్మలా పళనివేలు అధ్యక్షత వహించిన ఈ సభలో ముఖ్యఅతిథిగా జేకే రెడ్డి, ఆత్మీయ అతిథులుగా మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకర్‌రావు, డాక్టర్ దీవి రాంబాబు పాల్గొని శ్రీ కనకదుర్గా శతకం పుస్కకాన్ని ఆవిష్కరించారు. తొలి ప్రతిని శోభారాజా స్వీకరించారు. ముఖ్యఅతిథి జేకే రెడ్డి మాట్లాడుతూ... తెలుగు భాషా ప్రక్రియలో శతక ప్రక్రియకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. రచయిత, కవి, పాత్రికేయుడు గంగాధర ప్రసాద్ 108 పద్యాలతో శ్రీ కనకదుర్గా శతకం రాయడం అభినందనీయమన్నారు. ఆయన తన ప్రసంగంలో భాగంగా కనకదుర్గా శతకంలోని మూడు పద్యాలను శ్రావ్యంగా ఆలపించి సభను రంజింపజేశారు. అనంతరం నిర్మలా పళనివేలు మాట్లాడుతూ.. ప్రస్తుత డిజిటల్ యుగంలో పుస్తకాలు చదివే అలవాటు చాలా మందిలో తగ్గిందని, అయినా కవులు, రచయితలు పుస్తకాలు రాయడం ద్వారా తెలుగు భాషాభివృద్ధికి, భవిష్యత్తు తరాలకు బాసటగా నిలుస్తున్నారన్నారు. గంగాధర ప్రసాద్ జగజ్జనని గురించి రాసిన పద్యాలు పాఠకుల్లో భక్తి రసాన్ని నింపుతాయన్నారు. అనంతరం పుస్తక సమీక్ష చేసిన డాక్టర్ టి.మోహనశ్రీ... గంగాధర ప్రసాద్ దైవభక్తిని స్తుతిస్తూ రాసిన పద్యాలు సరళ రీతిలో పాఠకులకు అర్థమయ్యేలా వివరించారన్నారు. చివరగా రచయిత గంగాధర ప్రసాద్ తన స్పందన తెలియజేస్తూ.... 2008లో ప్రారంభించిన ఈ శతకం అనివార్య కారణాల రీత్యా మధ్యలో ఆగిందన్నారు. నేడు ఆ శతకాన్ని జనని సంస్థ పుస్తకం రూపంలోకి తీసుకొచ్చి చెన్నైలో ఆవిష్కరించడం సంతోషం కలిగించిందన్నారు. కార్యక్రమంలో సగలి సుధారాణి, అభ్యుదయ రచయితల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు యువశ్రీ మురళి, కథా రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం, ఉపాధ్యాయులు ఏడుకొండలయ్య, పలువురు కవులు, రచయితలు, తెలుగు భాషాభిమానులు పాల్గొని గంగాధర ప్రసాద్‌ను అభినందించారు.

సమాచార దర్శిని

నాగై-శ్రీలంక నౌకలో 20 వేల మంది పయనం

పెరంబూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం - శ్రీలంక మధ్య నడుపుతున్న ప్రయాణికుల నౌకలో ఏడాదిలో 20,098 మంది ప్రయాణించినట్లు నౌకా సంస్థ యజమాని సుందర్‌రాజన్ తెలిపారు. 2023 అక్టోబరులో నాగపట్టినం - శ్రీలంక మధ్య 'చెరియపాణి' పేరున నడిపిన నౌక తగినంత ప్రయాణికులు లేని కారణంగా నిలిపివేశారు. అనంతరం 2024 ఆగస్టు 16వ తేది 'శుభం' సంస్థ 'శివగంగై' పేరుతో నౌకా సేవలు ప్రారంభించింది. శివగంగై నౌక ప్రారంభించి శనివారంతో ఏడాది పూర్తికాగా, ఏడాదిలో 20,098 మంది ప్రయాణించారు. రెండో వార్షికోత్సవం ప్రారంభం సందర్భంగా 'శుభం' సంస్థ రాయితీ ప్రకటించింది. ఆ ప్రకారం, విద్యార్థులు మూడు పగళ్లు, రెండు రాత్రులు శ్రీలంకలో బస, నౌక టిక్కెట్టు కలిపి రూ.9,999గా ప్రకటించారు. విద్యార్థులతో వచ్చే ఇద్దరు టీచర్లకు ఉచిత టిక్కెట్లు అందిస్తామని నౌక సంస్థ యజమాని సుందర్‌రాజన్ తెలిపారు.

'సీఎం ట్రోఫీ' పోటీలకు పేరు నమోదుకు అవకాశం

పెరంబూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): 'సీఎం ట్రోఫీ' క్రీడా పోటీల్లో పేర్లు నమోదు చేసుకోవడానికి అవకాశం పొడిగించారు. సీఎం ట్రోఫీ క్రీడా పోటీలు పాఠశాల, కళాశాలలు, దివ్యాంగులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు అని ఐదు విభాగాల్లో నిర్వహించనున్నారు. జిల్లాస్థాయిలో ఐదు విభాగాల్లో 25 రకాల క్రీడా పోటీలు, మండల స్థాయిలో ఏడు రకాల పోటీలు, రాష్ట్రస్థాయిలో 37 రకాల పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలు ఈ నెలలో ప్రారంభమై సెప్టెంబరు వరకు నిర్వహించనున్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు https://cmtrophy.sdat.in, https://sdat.tn.gov.in లో తమ పేర్లు నమోదు చేసుకోవాలి. పేర్ల నమోదుకు ఈనెల 20వ తేది రాత్రి 8 గంటలకు వరకు పొడిగించారు. పేర్లు నమోదుచేసుకున్న వారిని మాత్రమే పోటీలకు అనుమతిస్తామన్నారు. వివరాలకు నెం.7401703480లో సంప్రదించాలని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ పేర్కొన్నారు.

'సక్సెస్ స్కూల్స్' పథకానికి రూ.111 కోట్ల కేటాయింపు

పెరంబూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరంలో 236 ప్రభుత్వ మహోన్నత పాఠశాలలను 'సక్సెస్ స్కూల్స్' మార్చే పనులకు రూ.111 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీ, జేఈఈ, నేషనల్ లా స్కూల్, సెంట్రల్ యూనివర్శిటీ వంటి ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశం పొందే అవకాశం తక్కువగా ఉంది. ఈ విధానం మార్చేలా 2021-22లో రాష్ట్రంలో 'తమిళనాడు ప్రభుత్వ మోడల్ స్కూల్స్' పథకం ప్రారంభించారు. మూడు సంవత్సరాల్లో జిల్లాకు ఒకటి చొప్పున 38 బోర్డింగ్ జిల్లా మోడల్ పాఠశాలలు ప్రారంభించారు. ఈ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉన్నత విద్యా సంస్థల్లో చేరేందుకు నిర్వహించే అర్హత పరీక్షపై శిక్షణ ఇస్తున్నారు. ఈ కారణంగా, మొదటి సంవత్సరం 75 మంది విద్యార్థులు, రెండవ సంవత్సరం 274 మంది, మూడవ సంవత్సరం 628 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ విద్యా సంస్థల్లో అడ్మిషన్లు పొందారు. తాజాగా, రాష్ట్రంలోని 414 బ్లాక్‌లలో 500 సక్సెస్ స్కూళ్లు ప్రారంభించారు. ఒక్కో బ్లాక్ నుంచి ఒక ప్రభుత్వ మహోన్నత పాఠశాల ఎంపిక చేసి, ఆ పాఠశాలలో స్మార్ట్ తరగతులు సహా ఆధునిక ఉపకరణాలు సమకూర్చేలా ప్రభుత్వం రూ.111 కోట్లు కేటాయించిందని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి చంద్రమోహన్ తెలిపారు.

'ఉంగళుడన్ స్టాలిన్' పథకానికి 30 లక్షల దరఖాస్తులు

పెరంబూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): 'ఉంగళుడన్ స్టాలిన్' పథక ప్రత్యేక శిబిరాల ద్వారా నెల రోజుల్లో 30 లక్షల దరఖాస్తులు అందాయని ప్రభుత్వ అధికారులు తెలిపారు. ప్రభుత్వ శాఖల సేవలు ప్రజల వద్దకు నేరుగా చేరేలా 'ఉంగళుడన్ స్టాలిన్' పథకాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ జూలై 15న చిదంబరంలో ప్రారంభించిన విషయం విదితమే. ఈ పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా 3,561 ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. పథకం ప్రారంభించి ఈనెల 15వ తేదీతో నెల రోజులు పూర్తికాగా, ప్రత్యేక శిబిరాల్లో 29,88,611 వినతి ప్రతాలు స్వీకరించగా, వాటిలో 13,72,679 మహిళా ప్రోత్సాహక నిధి కోరిన వినతిపత్రాలున్నాయి. వినతిపత్రాలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలిస్తున్నారని అధికారులు తెలిపారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ బోర్డు పేర్కొంది.

నంగనల్లూర్: వీవీ నగర్, ఎంజీఆర్ రోడ్డు, కనకాంబాల్ కాలనీ, విశ్వనాథపురం, హిందూ కాలనీ, ఎన్జీఓ కాలనీ, కేకే నగర్, టీచర్స్ కాలనీ, ఎస్బీఐ కాలనీ ఎక్స్‌టెన్షన్, ఏజీఎస్ కాలనీ, దురైస్వామి గార్డన్, 100 అడుగుల రోడ్డు, సివిల్ ఏవియేషన్ కాలనీ, అయ్యప్ప నగర్, కన్నిక కాలనీ, లక్ష్మి నగర్, ఎస్బీఐ కాలనీ 3వ వీధి, టీఎన్జీఓ కాలనీ, జయంతి నగర్, ఉల్లగరం, ఆళ్వార్ నగర్, మెక్‌మిల్లన్ కాలనీ, పెరుమాళ్ నగర్, ఎస్బీఐ కాలనీ, కన్నయ్య వీధి, కులక్కరై వీధి, కపిలర్ వీధి, కాలేజ్ రోడ్డు, వేంబులి అమ్మన్ వీధి 4వ మెయిన్ రోడ్డు, హిందూ కాలనీ, జోసఫ్ వీధి, కుప్పుస్వామి వీధి, గోవిందస్వామి వీధి, గాంధీ రోడ్డు, హరేఅముత్తమ్మన్ ఆలయ వీధి, కుమరన్ వీధి, చర్చ్ వీధి, కృష్ణస్వామి వీధి, మూవరసంపేట, పల్లవన్‌తాంగల్.

ఆవడి: బృందావన్ నగర్ 1 నుంచి 4 వీధులు, రాజీవ్ గాంధీ నగర్ 1 నుంచి 6 వీధులు, సీఆర్‌పీఎఫ్ కాంప్, మైకేల్ నగర్, సీఆర్‌పీఎఫ్ నగర్, మిట్టనమల్లి కాలనీ, చిదంబరం నగర్, ఉదయసూర్య వీధి, మిట్టనమల్లి గ్రామం, హవా నగర్, గణేశ్ నగర్, దీపాంజలి అమ్మన్ ఆలయం, పాలవేడు రోడ్డు, భారతి నగర్, ఐసిఎఫ్ కాలనీ, పెరియార్ నగర్, మసీదు వీధి, సాటి నగర్, మెస్ రోడ్డు, డిఫెన్స్ ఎన్‌క్లేవ్ అండ్ కాలనీ, హరేయ అమ్మన్ ఆలయం, గెంగురెడ్డి కుప్పం, భారతి నగర్ 1 నుంచి 12 వీధులు, విఘ్నరాజన్ నగర్, లక్ష్మీ నగర్, కండిగై.

మైలాపూర్: ల్యాక్ ఏరియా, రాయపేట హైవే, కాన్సెర్ట్ రోడ్డు, మందవెల్లి, సీవీ రామన్ కాలని, కర్పగాంబాళ్ నగర్, సీఐటీ కాలనిఇ, కాట్టుకోలి, దేశిక రోడ్డు, ఎంకే అమ్మన్ ఆలయ వీధి, లోకనాథన్ కాలనీ, సీపీ రామస్వామి రోడ్డు, దేవతి వీధి, ఈస్ట్ అభిరామపురం 1,2,3 మెయిన్ రోడ్లు, ఓలివర్ రోడ్డు, విశ్వేశ్వరపురం, కబాలి గార్డన్, పల్లక్కు మాణియం, వారెన్ రోడ్డు, రంగా రోడ్డు.

22న రాష్ట్రానికి అమిత్ షా



పెరంబూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి అమిత్‌షా ఈ నెల 22వ తేది రాష్ట్రానికి రానున్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది జరగనున్న నేపథ్యంలో, అన్ని పార్టీలు ఎన్నికల ప్రచారం ఇప్పటికే ప్రారంభించాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా బూత్ కమిటీల ఏర్పాటుపై దృష్టి సారించాయి. జూన్‌లో మదురై జరిగిన పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న అమిత్‌షా, ఇకపై ప్రతినెలా రాష్ట్రంలో పర్యటించనున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో, తిరునల్వేలిలో ఆదివారం బీజేపీ బూత్ ఏజెంట్ల మహానాడు జరగాల్సి ఉంది. కానీ, బీజేపీ సీనియర్ నేత ఇలా గణేశన్ మృతి కారణంగా మహానాడు ఈనెల 22వ తేదీకి వాయిదా వేశారు. తిరునల్వేలిలో ఈ నెల 22న జరిగే బూత్ ఏజెంట్ల మహానాడులో అమిత్ పాల్గొంటారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

రేపు చెన్నైలో 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాలు

పెరంబూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం 'ఉంగళుడన్ స్టాలిన్' ప్రత్యేక శిబిరాలు జరిగే ప్రాంతాలను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పేర్కొంది. 1వ మండలం పరిధిలో టీహెచ్ రోడ్డు గౌరీ ఆశ్రమం (తిరువొత్తియూర్ గౌరీ ఆశ్రమం బస్టాండ్ సమీపం), 3వ మండలం పరిధిలో వెస్ట్ కావాంగరై రాణిసొంగుపతి కల్యాణ మండపం, 4వ మండల పరిధిలో వ్యాసర్పాడి శర్మనగర్ రెండో మెయిన్ రోడ్డు సమీపంలోని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ హయ్యర్ సెకండరీ స్కూల్, 5వ మండలం పరిధిలో పాత వాషర్‌మెన్‌పేట ముట్టైతోట్టం ఫరూఖ్ మహల్, 6వ మండల పరిధిలో పురసైవాక్కం పెరంబూర్ బ్యారక్స్ రోడ్డు సమీపంలోని లక్ష్మీ మహల్, 7వ మండల పరిధిలో అంబత్తూర్ ఓల్డ్ బ్యాంక్ ఆఫ్ బరోడా వీధిలోని ఎస్ఎంకే కల్యాణ మండపం, 8వ మండలం పరిధిలో వెస్ట్ అన్నానగర్ జవహర్‌లాల్ నగర్ (100 అడుగుల రోడ్డు) ఎన్‌వీఎన్ నగర్ టీఎన్‌యూహెచ్‌డీబీ క్వార్టర్స్‌లో ప్రత్యేక శిబిరాలు జరుగనున్నాయి. అలాగే, 10వ మండల పరిధిలోని సైదాపేట రాజ్ థియేటర్ (నూర్జహాన్ థియేటర్), 11వ మండల పరిధిలో గంగానగర్ మేట్టుకుప్పంలోని హనురెడ్డి గార్డెన్, 12వ మండల పరిధిలోని నందంబాక్కం ఐడీపీఎల్ ల్యాండ్ (చెన్నై ట్రేడ్ సెంటర్ ఎదురుగా), 13వ మండల పరిధిలోని బిసెంట్ నగర్ శాస్త్రినగర్ 5వ క్రాస్ వీధిలోని కమ్యూనిటీ హాల్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే శిబిరాల్లో ప్రజలు వినతిపత్రాలు సమర్పించవచ్చని జీసీసీ తెలిపింది.

దీపావళి రైళ్ల ముందస్తు రిజర్వేషన్ ప్రారంభం

పెరంబూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ రైళ్ల ముందస్తు రిజర్వేషన్ ప్రారంభమైంది. ఈ ఏడాది దీపావళి పండుగను అక్టోబరు 20వ తేది దేశ ప్రజలు జరుపుకోనున్నారు. పండుగ సోమవారం వస్తుండంతో, రెండు రోజుల ముందు నుంచే ప్రజలు సొంతూళ్లకు వెళ్లే అవకాశం లభించింది. ఆ ప్రకారం, అక్టోబరు 16వ తేది ప్రయాణానికి రైళ్ల టిక్కెట్ల బుకింగ్ ఆదివారం ఉదయం 8 గంటలకు ఆన్‌లైన్, రైల్వే స్టేషన్లలోని కౌంటర్ల ద్వారా ప్రారంభమైంది. ముఖ్యంగా, మదురై, తిరునల్వేలి, తెన్‌కాశి తదితర ప్రాంతాలకు వెళ్లే పాండియన్, నెల్లై, పొదిగై సూపర్ ఫాస్ట్ రైళ్ల రిజర్వేషన్ ప్రారంభమైన 10 నిమిషాల్లోపే ముగిసి, వెయిటింగ్ లిస్ట్‌కు చేరింది. దీపావళి పండు ముందు రోజైన అక్టోబరు 19వ తేది ప్రయాణానికి సోమవారం దీపావళి రోజైన అక్టోబరు 20వ తేది ప్రయాణానికి ఈ నెల 19న రిజర్వేషన్ ప్రారంభం కానుందని అధికారులు తెలిపారు.

బంగాళా ఖాతంలో అల్పపీడనం

● కోవై, నీలగిరి జిల్లాలకు భారీ వర్ష సూచన

పెరంబూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బంగాళా ఖాతంలో ఈనెల 18న సోమవారం అల్ప పీడనం ఏర్పడనుందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా సమీపంలోని బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రానున్న 24 గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా కదిలి 19న తీరం దాటే అవకాశముందన్నారు. అల్పపీడనంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం లేకపోయినా, పశ్చిమ గాలుల వేగంలో మార్పుల కారణంగా తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశముందన్నారు. నీలగిరి, కోయంబత్తూర్ జిల్లాల్లోని కొండ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. అదే సమయంలో, నైరుతి రుతుపవనాల కదలిక చురుకుగా ఉండడంతో పశ్చిమ కనుమల కొండ సరిహద్దు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముందన్నారు. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ సాయంత్రం, రాత్రి వేళల్లో పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందన్నారు.. నగరంలో పగటి ఉష్ణోగ్రతలు 33-34 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 26-27 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది.

నర్సుపై చర్యలు తీసుకోండి

● ఆస్పత్రి క్లీనింగ్ సిబ్బంది డిమాండ్



ఆస్పత్రిలో నిరసన చేస్తున్న క్లీనింగ్ సిబ్బంది

తిరుత్తణి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో పనిచేస్తున్న క్లీనింగ్ సిబ్బందిపై అమర్యాదగా ప్రవర్తించిన నర్సుపై చర్యలు తీసుకోవాలంటూ ఆదివారం క్లీనింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న సిబ్బంది, సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా క్లీనింగ్ సిబ్బంది మీడియాతో మాట్లాడుతూ... ఆస్పత్రిలో పారిశుధ్య పనుల్లో పాల్గొంటున్న మహిళతో అదే ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సు మీరా అమర్యాదగా ప్రవర్తించడమే కాకుండా దుర్భాషలాడిందన్నారు. ఆస్పత్రి నిర్వాహకులు ఆమెపై చర్యలు తీసుకునే వరకు నిరసనను విరమించబోమని తెలిపారు. విషయం తెలుసుకున్న ఆస్పత్రి డాక్టర్ ప్రభుశంకర్ క్లీనింగ్ సిబ్బందితో చర్చించారు. నర్సుపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో క్లీనింగ్ సిబ్బంది నిరసన విరమించి విధుల్లోకి వెళ్లిపోయారు.

'కూలి' చిత్రానికి పిల్లలకు అనుమతి నిరాకరణ

● తల్లిదండ్రుల వాగ్వాదం



థియేటర్ నిర్వాహకులతో తల్లిదండ్రుల వాగ్వివాదం

పెరంబూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్‌లోని థియేటర్‌లో 'కూలి' చిత్రం చూసేందుకు పిల్లలను అనుమతించకపోవడంతో తల్లిదండ్రులు వాగ్వాదానికి దిగారు. రజనీకాంత్ నటించిన 'కూలి' చిత్రం ఇటీవల విడుదల కాగా, థియేటర్లు ప్రజలతో కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలో, కోయంబత్తూర్‌లోని ఓ థియేటర్ పిల్లలతో వెళ్లిన కొందరు తల్లిదండ్రులను థియేటర్ సిబ్బంది అడ్డుకుని, సినిమా చూసేందుకు పిల్లలకు అనుమతి లేదని చెప్పడంతో వారు వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని, తల్లిదండ్రులకు నచ్చచెప్పి అక్కడి నుంచి పంపించారు. సాధారణంగా ఒక్కో సినిమాకు దాని కథ, మాటలు, దృశ్యాలు తదితరాలు పరిగణలోకి తీసుకుని సర్టిఫికెట్ అందజేస్తుంటారు. ఆ ప్రకారం, కూలి చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్ అందజేశారు. నిబంధనల ప్రకారం ఏ సర్టిఫికెట్ పొందిన చిత్రాలకు 18 ఏళ్ల నిండిన వారిని మాత్రమే అనుమతించాలి. అంతకులోపు ఉన్న వారిని అనుమతించరాదు. ఈ విషయం ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసినప్పుడే హెచ్చరికగా వస్తుంది. ఈ నిబంధన అతిక్రమించి కొన్ని థియేటర్లలో పిల్లలను అనుమతిస్తున్నారని ఆరోపణలున్నాయి.

నెల్లికుండ్రం మురుగన్ ఆలయంలో ఘనంగా ఆడి ఉత్సవాలు




పుష్పాలంకారంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

తిరుత్తణి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా అతిమాంజేరి సమీపంలోని నెల్లికుండ్రం మురుగన్ ఆలయానికి ఆడి ఉత్సవాలు సందర్భంగా ఆదివారం ఉదయం పెద్దసంఖ్యలో భక్తులు పోటెత్తారు. వేలాది మంది భక్తులు పాల కావడి, నెమలికావడి తదితర కావళ్లతో పాదయాత్రగా తరలివచ్చి తమ మొక్కులు చెల్లించుకున్నారు. గత గురువారం ఉదయం ప్రారంభమైన ఈ ఉత్సవాలు వచ్చే మంగళవారం వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఉదయం 5 గంటలకు మంగళవాయిద్యాలు, శైవపండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చకులు ఆలయ గర్భగుడిని తెరిచిన అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు పొరుగు జిల్లాల నుండి వేలాది మంది భక్తులు ఆదివారం వేకువజామున ఆలయ ప్రాంగణాల్లో వేచివుండి స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు 500 మంది పోలీసులు ఆలయ భద్రతా విధుల్లో పాల్గొన్నారు.

కవిన్ హత్యకేసు సీబీఐకి అప్పగించండి

● పుదియతమిళగం అధినేత కృష్ణసామి డిమాండ్



తిరుచ్చిలో మీడియాతో మాట్లాడుతున్న కృష్ణసామి

చెన్నై, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలిలో జూలై 27న జరిగిన చెన్నై ఐటీ ఉద్యోగి కవిన్ పరువు హత్యకేసుపై సీబీఐ విచారణ జరపాలని పుదియ తమిళగం అధినేత డాక్టర్ కృష్ణసామి డిమాండ్ చేశారు. జూలై 27న తన సోదరిని కవిన్ ప్రేమిస్తున్నాడనే కోపంతో వేటకొడవలితో సుర్జిత్ హతమార్చాడు. ఈ కేసులో సుర్జిత్‌ను, అతడి తండ్రి, ఎస్ఐ శరవణకుమార్‌ను అరెస్టు చేశారు. ఈ పరువు హత్యను ఖండిస్తూ తిరుచ్చిలో పుదియ తమిళగం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ ఆందోళనకు డాక్టర్ కృష్ణసామి నాయకత్వం వహించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కవిన్ పరువు హత్యకేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. అగ్రకులానికి చెందిన యువతిని ప్రేమించిన పాపానికి నిమ్నకులస్తుడైన కవిన్‌ను హత్యచేశారని, ఈ హత్యకేసులో సుర్జిత్ తల్లి, తండ్రి ఎస్ఐలుగా ఉండటంతో కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరగవచ్చని పేర్కొన్నారు. ఈ హత్య కేసులో వాస్తవాలు బహిర్గతమయ్యేందుకు, నిజమైన దోషులకు శిక్షపడేందుకు సీబీఐతో విచారణ జరిపించడం సమంజసంగా ఉంటుందన్నారు.

మరి కొంతమంది డీఎంకే మంత్రులపై ఈడీ తనిఖీలు

కీల్ పెన్నాత్తూరు రోడ్‌షోలో ఈపీఎస్

ప్యారీస్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మరికొంత మంది డీఎంకే మంత్రుల ఇళ్లు, కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు తనిఖీలు నిర్వహిస్తారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. మక్కళై కాప్పోం - తమిళగత్తై మీడ్పోం' నినాదంతో ఈపీఎస్ చేపట్టిన ప్రచారయాత్ర ఆదివారం తిరువణ్ణామలై జిల్లా కీల్ పెన్నాత్తూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్‌షోలో ఈపీఎస్ మాట్లాడుతూ... రాష్ట్రంలో వచ్చే ఏడాది అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారం చేపట్టాక డీఎంకే అవినీతిపై విచారణ జరుపుతామన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన నిధులను కొంతమంది డీఎంకే మంత్రులు తమ సొంత ఖాతాల్లోకి మళ్లిస్తున్నారని ఆరోపించారు. ఈడీ అధికారులు ఇటీవల పలువురు రాష్ట్రమంత్రుల ఇళ్లు, కార్యాలయాల్లో నిర్వహించిన తనిఖీల్లో నల్లధనం, కోట్ల విలువైన ఆస్తుల పత్రాలు పట్టుబడినట్లు తెలిసిందన్నారు. నేరాలకు పాల్పడుతున్న వారికి డీఎంకే ప్రభుత్వం అండగా ఉందని, అందువల్లే రాష్ట్రవ్యాప్తంగా దొంగతనాలు, హత్యాయత్నాలు, హత్యలు, మహిళలపై అత్యాచారాలు ప్రతిరోజు చోటుచేసుకుంటున్నాయని ధ్వజమెత్తారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో విద్య, ప్రజారోగ్యం, పరిశ్రమల అభివృద్ధి, కార్మికులకు రాయితీలు అందించామని, ప్రస్తుత డీఎంకే ప్రభుత్వంలో వీటికోసం ప్రజలు రోడెక్కాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దేశంలోనే రూ.5లక్షలా 38వేల కోట్లు రుణంగా పొందిన ముఖ్యమంత్రి స్టాలిన్‌కు 'సూపర్ సీఎం' అనే బిరుదు సరిపోతుందన్నారు. ఓటేసి గెలిపించిన రాష్ట్ర ప్రజలకు రుణభారాన్ని బహుమతిగా అందించారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 5లక్షల పోస్టులను భర్తీ చేస్తామన్న హామీని నెరవేర్చకుండా ఈ నాలుగేళ్లలో 50వేల మందికి మాత్రమే ఉద్యోగాలు కల్పించారన్నారు. అలాగే పాత పింఛన్ విధానం తీసుకొస్తామని, పెట్రోల్, గ్యాస్ సిలిండర్లకు రాయితీ కల్పిస్తామని, నీట్ రద్దు చేయిస్తామన్న హామీలను నెరవేర్చలేదని ఈపీఎస్ దుయ్యబట్టారు. పథకాలకు పేర్లు పెట్టడంలో సీఎం స్టాలిన్‌కు మించినవారు లేరన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని హామి ఇచ్చిన పథకాలను నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెట్టేందుకు కొత్తపథకాలు అమలు చేయడం హాస్యాస్పదమన్నారు. డీఎంకే ప్రభుత్వ పదవీకాలం మరో 7 నెలల్లో ముగియనున్న నేపథ్యంలో, ఆ లోపు అన్ని హామీలను నెరవేర్చుతామని డీఎంకే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మాట్లాడడాన్ని ప్రజలు నమ్మేస్థితిలో లేరని ఈపీఎస్ అన్నారు.

15 గంటలపాటు కొనసాగిన ఈడీ సోదాలు

● మంత్రి పెరియసామితో అధికారుల కరచాలనం!

● దస్తావేజుల స్వాధీనం

చెన్నై, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రి ఐ.పెరియసామి, ఆయన కుటుంబీకుల నివాసాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు 15 గంటలపాటు జరిపిన సోదాలు ముగిశాయి. చెన్నై గ్రీన్‌వేస్ రోడ్డులోని పెరియసామి అధికారిక గృహం, దిండుగల్ గోవిందాపురం దురైరాజ్ నగర్‌లోని ఇంట్లో శనివారం ఉదయం ఈడీ అధికారులు ఒకే సమయంలో దాడులు నిర్వహించిన విషయం తెలిసింది. ఇదే విధంగా దిండుగల్ శీలప్పాడిలో ఉన్న కుమారుడు, ఎమ్మెల్యే సెంథిల్‌కుమార్ నివాసగృహం, వల్లలార్ నగర్‌లోని కుమార్తె ఇందిర నివాసగృహంలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. దిండుగల్ - వత్తలకుండు రహదారిలోని మంత్రి కుటుంబీకులకు చెందిన 6 స్పిన్నింగ్‌మిల్లులోనూ తనిఖీలు చేశారు. శనివారం ఉదయం ప్రారంభమైన ఈ దాడులు అర్ధరాత్రి వరకు అంటే సుమారు 15 గంటలకు పైగా కొనసాగాయి. ఈ దాడుల్లో నగలు, నగదు పట్టుబడలేదని, కీలకమైన దస్తావేజులు మాత్రమే లభించాయని ఈడీ ప్రకటించింది. అదే సమయంలో దిండుగల్‌లో మంత్రి పెరియసామి నివాసగృహంలో శనివారం ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు తనిఖీ చేసిన ఈడీ అధికారులు ఆస్తుల వివరాలకు సంబంధించిన దస్తావేజులను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత మంత్రి పెరియసామికి వరుసగా షేక్‌హ్యాండ్ ఇచ్చి బయలుదేరారు. ఈడీ అధికారులు కొందరు పెరియసామితో కరచాలనం చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ దాడుల్లో మంత్రి పెరియసామి కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాల డాక్యుమెంట్లు, పెట్టుబడుల డాక్యుమెంట్లు, బ్యాంక్ ఖాతాల వివరాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

తిరుమావళవన్ పిన్నమ్మ మృతికి సీఎం సంతాపం

పెరంబూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ పిన్నమ్మ మృతికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సంతాపం తెలిపారు. తిరుమావళవన్ జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు అతని మొబైల్‌ఫోన్‌కు కాల్ చేయగా, తన పిన్నమ్మ మృతిచెందినట్లు తెలిపారన్నారు. పిన్నమ్మపై ఆయనకు ఉన్న ప్రేమ, ఆమె మృతితో ఆయన ఆవేదన తలుచుకుని కన్నీళ్ల పర్యంతం అయ్యానన్నారు. ప్రియమైన సోదరుడు తిరుమావళవన్‌కు, ఆయన కుటుంబ సభ్యులు, బంధువులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపినట్లు సీఎం ట్వీట్ చేశారు.

'యూ ట్యూబ్' చూసి షేర్ మార్కెట్లో పెట్టుబడులు

● నష్టాలతో వివాహిత ఆత్మహత్య

పెరంబూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): యూట్యూబ్ చూసి షేర్ మార్కెట్లో పెట్టిన పెట్టుబడులతో నష్టాలు రావడంతో మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక పల్లావరంలోని పొలిచ్చలూరు జ్ఞానమణి నగర్ 3వ వీధికి చెందిన అరుణ్, వనజ దంపతులు కుమార్తెలతో కలసి నివిస్తున్నారు. దివ్యాంగుడైన అరుణ్ పెయింటింగ్ డిజైనర్. కొద్ది రోజుల క్రితం యూట్యూబ్ చూసి షేర్ మార్కెట్లో తక్కువ పెట్టుబడులు పెట్టిన వనజకు ఆదాయం వచ్చినట్లు సమాచారం. దీంతో, ఆమె ఆన్‌లైన్ సంస్థల నుంచి రుణాలు తీసుకుని సుమారు రూ.2.5 లక్షల వరకు షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టగా, నష్టం వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో, రుణం చెల్లించాలని వనజకు ఆన్‌లైన్ సంస్థ ఒత్తిడి చేస్తోంది. దీంతో, ఒత్తిడి తట్టుకోలేని వనజ.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు, వనజ సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని పరిశీలించారు. మూడు ఆడియోలు లభించాయి. అందులో ఒకటి... 'నేను ప్రైవేటు బ్యాంక్‌లో రూ.2.5 లక్షల రుణం తీసుకోగా, రుణం చెల్లించాలంటూ ఒత్తిడి వచ్చింది, అందువల్ల ఏం చేయాలో నాకు పాలుపోవడం లేదు. నన్ను క్షమించండి' అంటూ తన భర్తకు వాట్సాప్ ద్వారా మెసేజ్ పంపి ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసుల విచారణలో తెలిసింది.

గుండెపోటుతో ఎంటీసీ బస్సు కండక్టర్ మృతి

ప్యారీస్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) బస్సు కండక్టర్ గుండెపోటుతో మృతిచెందాడు. తిరువొత్తియూర్‌కు చెందిన రమేష్ (56) ఆదివారం తెల్లవారుజామున 4.45 గంటలకు తిరువొత్తియూర్ డిపోకు వెళ్లి డ్రైవర్ పాండియన్‌తో 56సి సిటీ బస్సులో మద్రాస్ హైకోర్టు వెళ్లి తిరిగి తిరువొత్తియూర్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో గుండెనొప్పి అధికం కావడంతో అంబులెన్స్‌లో ప్రభుత్వ స్టాన్లీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి వైద్యులు పరిశీలించి రమేష్ మృతిచెందినట్లు నిర్ధారించారు. దీనిపై తిరువొత్తియూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మదురైలో కారుతో ఢీకొట్టి యువకుడి హత్య

పెరంబూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కుమార్తెను ప్రేమ వివాహం చేసుకున్నాడన్న ఆగ్రహంతో యువకుడిని కారుతో ఢీకొట్టి హతమార్చిన ఘటన మదురై జిల్లాలో కలకలం రేపింది. బూదమంగళానికి చెందిన సతీష్ కుమార్ (21), తూంబైపట్టికి చెందిన రాఘవి (24)ని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. రాఘవికి ఇదివరకే వివాహమై, భర్త రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈక్రమంలో రాఘవి, సతీష్‌ను ప్రేమించి వివాహం చేసుకుని తిరుచ్చిలో నివసిస్తోంది. అదే సమయంలో రాఘవి కంటే సతీష్ చిన్నవాడు కావడంతో ఆమె తల్లిదండ్రులు వివాహానికి అంగీకరించలేదు. ఈ క్రమంలో, ఇంట్లో నగలు తీసుకెళ్లిందని రాఘవిపై తల్లిదండ్రులు మేలూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై శనివారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఇరువర్గాలతో పోలీసులు చర్చలు జరిపారు. తదుపరి చర్చలకు ఆదివారం రావాలన్నారు. దీంతో, సతీష్‌కుమార్ తన ద్విచక్రవాహనంపై భార్య రాఘవితో కలసి బయల్దేరాడు. అయ్యాపట్టిలో వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని రాఘవి బంధువులు ప్రయాణిస్తున్న కారుతో ఢీకొట్టారు. ఈ ఘటనలో తీవ్రగాయాలతో సతీష్‌కుమార్ ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సతీష్‌కుమార్ మృతదేశాన్ని పోస్టుమార్టానికి తరలించారు. అలాగే, గాయపడిన రాఘవిని కూడా అదే ఆసుపత్రికి చికిత్స కోసం చేర్పించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.


మృణాల్ ఠాగూర్

కోలీవుడ్‌లో హాటెస్ట్ హీరోయిన్‌గా మృణాల్?

అగ్ర హీరో ధనుష్‌తో హీరోయిన్ మృణాల్ ఠాకూర్ పీకల్లోతు ప్రేమలో మునిగితేలుతుందంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ ప్రచారంతో ఆమె కోలీవుడ్‌లో హాటెస్ట్ హీరోయిన్‌గా మారిపోయారు. ఆమె పూర్తి వివరాలు తెలుసుకునేందుకు తమిళ అభిమానులు తెగ ఉత్సాహం చూపుతున్నారు. పైగా మృణాల్‌తో డ్యూయెట్లు పాడేందుకు కూడా పలువురు కోలీవుడ్ హీరోలు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే శివ కార్తికేయన్ సరసన ఓ తమిళ, తెలుగు ద్విభాషా చిత్రంలో ఆమె నటిస్తున్నారు. మరికొన్ని తమిళ చిత్రాల్లో నటించేందుకు ఆమె ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో మృణాల్ వివరాలను తెలుసుకునేందుకు ప్రేక్షకులు ఆసక్తి చూపుతుండటంతో ఇంటర్నెట్ సెర్చింగ్‌లో ఆమె ట్రెండింగ్ అవుతున్నారు. విచిత్రమేమిటంటే మృణాల్ ఠాకూర్ ఇప్పటివరకు ఒక్క తమిళ స్ట్రెయిట్ చిత్రంలో కూడా నటించక పోవడం గమనార్హం. అయినప్పటికీ ఆమె కోలీవుడ్ ప్రేక్షకుల్లో చర్చనీయాంశంగా మారారు.

చిత్రజ్యోతి

'కడుక్కా' సందేశాత్మక చిత్రం

● పేరరసు

చిత్రాన్ని ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ధనుంజయన్ విడుదల చేసేందుకు ముందుకు వచ్చారంటే అందులో మంచి సందేశం ఉంటుందని ప్రముఖ దర్శకుడు, కోలీవుడ్ దర్శకుల సంఘం ప్రధాన కార్యదర్శి పేరరసు అన్నారు. విజయ్ గౌరీష్ ప్రొడక్షన్స్ పతాకంపై నియంత్ మీడియా అండ్ టెక్నాలజీ, మలర్ మారి మూవీస్ పతాకంపై నిర్మాతలు గౌరీశంకర్ రవిచంద్రన్, ఆనంద్ పొన్నుస్వామి సంయుక్తంగా నిర్మించిన 'కడుక్కా' ఆడియో, ట్రైలర్ విడుదల వేడుకలు నగరంలో శనివారం రాత్రి జరిగాయి. సినీ నిర్మాతలు సీవీ కుమార్, ధనుంజయన్, దర్శకుడు పేరరసు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై ఆడియోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్మాత సీవీ కుమార్ మాట్లాడుతూ... 'గతంలో నేను నిర్మించిన 'అట్టకత్తి' తరహాలోనే ఈ చిత్రం ఉన్నట్టుగా ట్రైలర్ చూస్తే తెలుస్తోంది. ఈ సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. నిర్మాత ధనుంజయన్ మాట్లాడుతూ... 'ఈ సినిమా 'అట్టకత్తి'కి ట్రిబ్యూట్‌గా ఉంటుంది. అందుకే నిర్మాత సీవీ కుమార్‌ను ఈ ఆడియో వేడుకకు రావాలని ఆహ్వానించా. నేను విడుదలకాని అనేక చిత్రాలు చూస్తున్నా. ఈ సినిమా చూశాక... మంచి సందేశం ఉండటంతో విడుదల చేయాలని నిర్ణయించా. హీరోహీరోయిన్లు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. 'నాళై నమదే' చిత్రానికి నా వంతు సాయం చేసి విడుదల చేయగా, మీడియా కూడా మంచి రివ్యూలు రాసి సినిమాను సక్సెస్ చేసింది. అలాగే, ఈ చిత్రాన్ని కూడా విజయవంతం చేయాలని కోరుతున్నా' అని పేర్కొన్నారు. కాగా, ఈ చిత్రంలో విజయ్ గౌరిష్, స్నేహా, ఆదర్ష్ మదికాంత్, మంజునాథన్, మణిమేఘలై, సుధా తదితరులు నటించారు. సతీష్ కుమార్ దురైకన్ను సినిమాటోగ్రఫీ అందించిన ఈ చిత్రానికి సంగీతం కెవిన్ డికోస్టా అందించగా, దర్శకత్వం ఎస్ఎస్ మురుగదాస్ వహించారు.



'కడుక్కా' ఆడియో ఆవిష్కరణ

దీపావళి రేస్ నుంచి తప్పుకున్న 'కరుప్పు'

సూర్య హీరోగా ఆర్జే బాలాజీ దర్శకత్వంలో రూపొందుతున్న 'కరుప్పు' చిత్రం దీపావళి రేస్ నుంచి తప్పుకున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. చిత్రీకరణ పనులన్నీ దాదాపుగా పూర్తయ్యాయి. చివరి దశ నిర్మాణ పనులు మాత్రమే మిగిలివున్నాయి. దీంతో దీపావళికి విడుదల చేయాలని భావించారు. అయితే, ఈ సినిమా వ్యాపార చర్చలు ఇంకా పూర్తికాలేదు. ముఖ్యంగా ఓటీటీ, టెలివిజన్ రైట్స్‌పై చర్చల్లో ప్రతిష్ఠంభన తలెత్తింది. పైగా ఈ యేడాది దీపావళి పండుగ అక్టోబరులోనే రానుంది. దీంతో ఈ చిత్రాన్ని దీపావళికి విడుదల చేయడం కష్టంగా భావిస్తున్నారు. కాగా, డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై నిర్మితమైన ఈ చిత్రంలో సూర్య, త్రిష, శివద, మాయా రవి, ఇంద్రన్స్, నట్టి తదితరులు నటించారు. జీకే విష్ణు సినిమాటోగ్రఫర్‌గా పనిచేయగా, సాయి అభయంకర్ సంగీత స్వరాలు సమకూర్చారు.


'కరుప్పు'లో సూర్య

తమిళ సినిమాలో మోనోపలి ఉంది

● నటుడు ఉదయ

తమిళ చిత్రపరిశ్రమలో మోనోపలి (గుత్తాధిపత్యం) ఉందని నటుడు ఉదయ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉదయ, అజ్మల్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'అక్యూస్డ్'. ప్రభు శ్రీనివాస్ దర్శకత్వం వహించగా, కన్నడ నటి జాన్విక హీరోయిన్‌గా నటించారు. నరేన్ బాలకుమార్ సంగీతం సమకూర్చిన ఈ చిత్రానికి ఉదయ, దయా ఎన్ పన్నీర్‌సెల్వం, ఎం.తంగవేల్ నిర్మాతలు. ఈనెల 1న ఈ చిత్రం విడుదలైంది. ఈ సినిమా విజయోత్సవాలను శనివారం రాత్రి చెన్నైలో నిర్వహించారు. ఇందులో నిర్మాతలు ఏ.ఎల్.అళగప్పన్, అళగన్ తమిళమణి, సౌందర్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకలో నటుడు ఉదయ మాట్లాడుతూ... 'ఈ సినిమా మూడో వారంలోకి ప్రవేశించి విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. చిత్రపరిశ్రమలో కుట్రలు, కుతంత్రాలు, శత్రుత్వం, ప్రతీకారాలు ఉన్నాయి. ఈ సినిమా విడదుదల కాకుండా అడ్డుకునేందుకు పలువురు యత్నించారు. అయితే, సినిమా విడుదలై విజయవంతమైతే అది ప్రేక్షకులకే చెందుతుంది. ఏ సంఘమైనా బలంగా ఉండాలి. ఎందుకంటే తమిళ సినిమా మోనోపోలి ఉందని గట్టిగా చెబుతా. ఇందులో మనం విజయం సాధించడం కష్టం. సంవత్సరాల అనుభవం ఉన్న మనకు ఇలా జరుగుతుంటే కొత్త నిర్మాతల పరిస్థితిని ఊహించడం కష్టం. నిర్మాతల అసోసియేషన్‌లో కూడా స్వార్థం ఉంది. ఈ పరిస్థితి మారాలి. త్వరలోనే మా కాంబినేషన్‌లో మరో చిత్రం చేస్తాం' అని అన్నారు. ఆ తర్వాత చిత్ర బృందం సభ్యులతో పాటు అతిథులు కూడా తమ అభిప్రాయాలను వెల్లడించారు.


'అక్యూస్డ్' విజయోత్సవంలో చిత్ర బృందం

వీధి కుక్కలపై కరుణ చూపండి!

● చెన్నై, తిరుచ్చిల్లో జంతుప్రేమికుల ర్యాలీ


శునకాలపై హింస వద్దంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్న జంతు ప్రేమికులు


చెన్నైలో వీధి కుక్కలపై కరుణ చూపాలంటూ రోడ్డుపై బైఠాయించిన జంతు ప్రేమికులు



ర్యాలీలో పాల్గొన్న నటి వినోదిని - తిరుచ్చిలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న యువతులు

చెన్నై, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ధర్మాసనం వెలువరించిన ఉత్తర్వును ఖండిస్తూ చెన్నై, తిరుచ్చిలో ఆదివారం ఉదయం జంతు ప్రేమికులు ర్యాలీలను నిర్వహించారు. ఈ ర్యాలీలో నటి వినోదిని వైద్యనాథన్, ఛాయావరలక్ష్మి, అమ్ము, దర్శకుడు వసంత్ సహా పలువురు బుల్లితెర కళాకారులు, శునకాలను పెంచుకుంటున్నవారు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీని ఉద్దేశించి నటి వినోదిని మాట్లాడుతూ... కుక్కకాటు వల్ల మనిషి ప్రాణానికి ముప్పువాటిల్లుతుందని, అయితే ఎక్కడో జరిగే ఒకటి రెండు సంఘటనలపై ఆందోళన వ్యక్తం చేస్తూ శునకాలన్నింటినీ వీధులలో తిరగనీయకుండా సంరక్షణ కేంద్రాలలో బంధించడం అన్యాయమన్నారు. శునకాలకు సంతానోత్పత్తి నిరోధక టీకాలు వేసి వాటి సంఖ్యను తగ్గిస్తే పరవాలేదన్నారు.

అంత తిండి పెడితే చాలు.. :తిరుచ్చి నగరంలో జరిగిన ర్యాలీలో సుమారు 200 మంది జంతు ప్రేమికులు పాల్గొన్నారు. ఆ ర్యాలీలో పాల్గొన్న ప్రియా అనే యువతి మాట్లాడుతూ... వీధి కుక్కలు ఒక్క పూట తిండి దొరక్క విలవిలలాడుతున్నాయని, వాటికి కాసింత భోజనం పెడితే చాలునన్నారు. ఆకలి వల్లే శునకాలు మనుషుల వెంటబడుతున్నాయన్న విషయం గుర్తించాలన్నారు. కుక్క కాటుకు టీకాలున్నాయని, సకాలంలో వైద్యులను సంప్రదించి చికిత్సలు చేసుకుంటే ప్రాణాపాయం లేదన్నారు. ఏది ఏమైనప్పటికీ శునకాలన్నింటిని సరంక్షణ కేంద్రాలకు తరలించాలన్న సుప్రీంకోర్టు తన ఉత్తర్వును పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు.


ఆలయ ఏర్పాట్లపై ఆరా తీస్తున్న మంత్రి శేఖర్‌బాబు

ఏకాంబరేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేకం ఏర్పాట్ల పరిశీలన

ప్యారీస్,ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పార్క్‌టౌన్‌లోని పురాతన ఏకాంబరేశ్వరాలయ మహాకుంభాభిషేకం ఈనెల 21న నిర్వహించనున్న నేపథ్యంలో కుంభాభిషేకం పనులను ఆదివారం రాష్ట్ర హిందూ దేవాదాయశాఖ మంత్రి పీకే.శేఖర్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ...ఏకాంబరేశ్వరాలయంలో రూ.10 కోట్లతో జీర్ణోద్ధరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. మహాకుంభాభిషేకోత్సవంలో సుమారు 5వేల మందికి పైగా భక్తులు పాల్గొనే అవకాశముందని, వారికి శీఘ్ర దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మంత్రితో పాటు హిందూ దేవాదాయశాఖ అదనపు కమిషనర్లు డాక్టర్ సి.పళని, పి.జయరామన్, జోన్ సహాయ కమిషనర్ ఐ.ముల్లై, అసిస్టెంట్ కమిషనర్ హరిహరన్, ధర్మకర్త జె.అశోక్‌కుమార్ ముందిరా, పి.వెంకటేశ్వరన్, శశికళ, ముత్తుకుమార్, జె.హరికుమార్. ఎస్.మురళి, పి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

గీతాభవన్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి


ఫొటో ప్రదర్శనను వీక్షిస్తున్న సంస్థ నిర్వాహకులు

ప్యారీస్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోపాలపురంలోని గీతాభవన్‌లో శ్రీకష్ణజయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. శ్రీకృష్ణుడి జన్మభూమి నుంచి కురుక్షేత్ర సంగ్రామం వరకు, శ్రీరాముడి వనవాస ఘట్టాల్ని కళ్లకు కట్టినట్లు దేవతామూర్తుల ప్రతిమలతో కొలువుదీర్చిన తీరు చూపరులను మైమరపించింది. శ్రీగీతా భవన్ ట్రస్ట్ నేతృత్వంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్ని అవ్వైషణ్ముగం రోడ్డులో ఉన్న గీతాభవన్ హాలులో నిర్వహించారు. ఇందులో భాగంగా కృష్ణావతారాన్ని ఎత్తి చూపుతూ, దేవతామూర్తుల ప్రతిమలతో కొలువుదీర్చిన ఆధ్యాత్మిక సందర్శన నిలయాన్ని భక్తిభావంతో ముంచెత్తే విధంగా ఏర్పాట్లు చేశారు. ఐపీఎస్ అధికారి సంతోష్‌కుమార్ హాజరై కృష్ణజయంతి సందర్భంగా జరిగిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం మహావిష్ణువు దశావతారాల ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. గీతా భవన్ ట్రస్ట్ చైర్మన్ ఓంప్రకాష్ మోదీ, మేనేజింగ్ ట్రస్టీ మనుగోయల్, ట్రస్టీ శివకుమార్ గొయెంకా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నామక్కల్ ఆంజనేయుడికి ప్రత్యేక అభిషేకం

పెరంబూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ ఆంజనేయ స్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక అభిషేకం, పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నామక్కల్ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో 18 అడుగుల ఏక శిలా ఆంజనేయ విగ్రహం భక్తులను ఆకట్టుకుంటోంది. ఆలయంలో ప్రతిరోజు ఆంజేయుడికి అభిషేకాలు, పూజలు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో, ఆవణి నెల ప్రారంభమైనప తొలి ఆదివారం సందర్భంగా ఆంజనేయుడికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వేకువజామునే ఆలయాన్ని తెరచి, స్వామివారికి 1008 వడమాలలు సమర్పించారు.అనంతరం భట్టాచార్యులు,ఆంజేయుడికి క్షీరాభిషేకం, పంచామృతం, పసుపు, ఇతర సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, విగ్రహాన్ని పూలతో అలంకరించారు.ఈ వేడుకల్లో నామక్కల్‌తో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని సేవించారు. వేడుకల సందర్భంగా ఆలయం, పరిసర ప్రాంతాల్లో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.


అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

పేదల ఊటీ... పర్యాటకుల రద్దీ


ఏర్కాడు బోట్‌హౌస్ వద్ద గుమికూడిన పర్యాటకులు

చెన్నై, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పేదల ఊటీగా పేరుగాంచిన ఏర్కాడులో వారాంతపు సెలవుల కారణంగా పర్యాటకుల రద్దీ విపరీతంగా పెరిగింది. ఏర్కాడు పరిసర ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు సందర్శన ప్రాంతాల్లో చల్లటి వాతావరణం కొనసాగుతోంది. దీంతో రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలైన పుదుచ్చేరి, కర్నాటక, కేరళ నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బోట్ సవారీ ప్రాంతం వద్ద ఆదివారం వేకువజామునే పర్యాటకులు బారులు తీరారు. అన్నా గార్డెన్, లేడీస్ సీట్ తదితర పర్యాటక ప్రాంతాల్లో కూడా గుమికూడారు. ఇక పర్యాటకులు తీసుకువచ్చిన కార్లు, వ్యాన్లు తదితర వాహనాలతో పార్కింగ్ ప్రాంతాలు నిండిపోయాయి. దీనితో పలు చోట్ల రహదారులపై వాహనాలను నిలిపి ఉంచడంతో రాకపోకలకు సమస్యలు తలెత్తాయి. పర్యాటకుల సంఖ్య పెరగటంతో పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.


ఆదివారం ఉదయం ఏర్కాడు మెయిన్‌రోడ్డులో నిలిచిన వాహనాలు

విద్యార్థులకు బహుముఖ పరిజ్ఞానం అవసరం


● శ్రీసిటీ అధినేత రవి సన్నారెడ్డి ● జెట్-చెన్నై భజన పోటీలకు విశేష స్పందన


ప్రథమ బహుమతి గ్రహీతలతో రవి సన్నారెడ్డి, రవీంద్రకుమార్‌రెడ్డి, జెట్ నిర్వాహకులు

ప్యారీస్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థులు రాణించడానికి బహుముఖ పరిజ్ఞానం అవసరమని శ్రీసిటీ అధినేత డాక్టర్ రవి సన్నారెడ్డి పేర్కొన్నారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెట్) చెన్నై విభాగం ఆధ్వర్యంలో ఆదివారం టి.నగర్‌లోని పీఆర్‌సీ సెంటినరీ హాలులో త్రిదండి చిన్న జీయర్‌స్వామి మంగళ శాసనాలతో నిర్వహించిన భజన పోటీల్లో 20 పాఠశాలల నుండి 26 గ్రూప్‌లకు చెందిన సీనియర్, జూనియర్ విద్యార్థినీవిద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. శ్రీరామ, శ్రీకృష్ణ, శ్రీవేంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ, శ్రీమన్నారాయణ, భగవత్ రామానుజులను కీర్తిస్తూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మికతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. వడపళని సాందీపని పాఠశాలకు చెందిన బిలహరి గ్రూప్ ప్రథమ, కేకేనగర్ పీఎస్‌బీబీ పాఠశాల రీతిగౌలా టీం ద్వితీయ, టి.నగర్ పీఎస్‌బీబీ పాఠశాల రంజనీ గ్రూప్ తృతీయ స్థానాల్లో నిలిచాయి. వీరికి వెండి పతకాలతో పాటు ప్రశంసాపత్రాలను శ్రీసిటీ అధినేత రవి సన్నారెడ్డి అందజేసి ఆశీర్వదించారు. జెట్ చెన్నై అధ్యక్షుడు పి.రవీంద్రకుమార్‌రెడ్డి, నిర్వాహకులు, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించి విద్యార్థులు, వారితో పాల్గొన్న తల్లిదండ్రులకు అన్నప్రసాదాలు అందజేశారు.

మాతో టచ్‌లో డీఎంకే నేతలు!

● బీజేపీలో చేరేందుకు రహస్యమంతనాలు
● కేంద్రమంత్రి ఎల్ మురుగన్



చెన్నై, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో చేరేందుకు డీఎంకే సీనియర్ నేతలు పలువురు క్యూ కడుతున్నారని, ఆ దిశగా పార్టీ రాష్ట్ర శాఖ నాయకులతో రహస్యంగా మంతనాలు కూడా జరుపుతున్నారని కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ అన్నారు. నగరంలో ఆదివారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ... అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఎన్డీయే తరఫున రాష్ట్ర వ్యాప్త పర్యటనను ప్రారంభించిన నాటినుంచి డీఎంకే పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. రాష్ట్ర మంత్రి పెరియసామి నివాసగృహాల్లో జరిగిన ఈడీ తనిఖీలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధాలు లేవని మురుగన్ స్పష్టం చేశారు. ఈడీ, ఐటీ స్వంతంత్ర్య దర్యాప్తు సంస్థలని, వాటికి అందే రహస్య సమాచారాలను బట్టి తనిఖీలు జరుపుతుంటాయన్నారు. అన్వర్‌రాజా, డాక్టర్ మైత్రేయన్ డీఎంకేలో చేరడం వల్ల అన్నాడీఎంకేకు ఎలాంటి నష్టం లేదంటూనే... అనువైన వేళ ఏయే నేతలు బీజేపీలో చేరబోతున్నారనే విషయాలను వెల్లడిస్తానని మురుగన్ చెప్పారు. బీజేపీతో మంతనాలు జరుపుతున్నవారంతా తాము ఆహ్వానిస్తే క్షణాలలో పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నారని, ఆ విషయాలను డీఎంకే నేతలే తనకు చెబుతున్నారని పేర్కొన్నారు. ఇక కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈనెల 22న తిరునల్వేలిలో ఐదు లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించిన బూత్‌కమిటీ నిర్వాహకుల సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ అధ్యక్షత వహిస్తారన్నారు. వచ్చే యేడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహాలు, అభ్యర్థుల ఎంపికపై అమిత్‌షా దిశానిర్దేశం చేస్తారన్నారు.

ఎస్‌కేపీడీ హాస్టల్ పూర్వ విద్యార్థుల
ఆత్మీయ సమ్మేళనం



సహాయాలు అందుకున్న విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

ప్యారీస్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ) నిర్వహణలోని హాస్టల్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం 107వ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. జార్జిటౌన్ ఆదియప్ప నాయకన్ వీధిలోని ఎస్‌కేపీడీ దేవస్థానంలో ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అర్చన, అలంకార పూజలు నిర్వహించారు. 10 గంటలకు ఎస్‌కేపీడీ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ప్రారంభమైన ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా జయరాజ్ గ్రూప్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్ తాడేపల్లి, గౌరవ అతిథిగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ, ఆత్మీయ అతిథులుగా ఎస్‌కేపీడీ ట్రస్టీ తాతా బద్రీనాథ్, అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ బండారు చంద్రయ్య, కనిగెలుపుల రాధాకృష్ణమూర్తి, కె.గోపాల్‌చెట్టి, ఎంకే రవీంద్రన్ సహా 74 మందికి పైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.జగదీష్‌బాబు, కార్యదర్శి గుర్రం బాలాజి, కోశాధికారి ఎస్‌రాములు, వైస్ ప్రెసిడెంట్ ఎంఏ నరసింహన్ అతిథులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. 107వ ఆత్మీయ సమ్మేళం సందర్భంగా మెరిట్ స్టూడెంట్లకు ఆర్థిక సహాయం, 18 మంది హాస్టల్ విద్యార్థులకు ట్రావెల్ బ్యాగ్స్, ఇన్‌డక్షన్ స్టౌ, హాస్టల్ సీనియర్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ముందుగా టి.జగదీష్‌బాబు మాట్లాడుతూ... 2016లో తమ పూర్వ విద్యార్థుల సంఘం తరుపున జరుపుకున్న సెంటినరీ వేడుకల్లో తమకు విద్యనేర్పిన గురువులతో పాటు పలు రంగాల్లో రాణిస్తున్న ప్రముఖులను సత్కరించి, వారి ఆశీస్సులందుకున్నామన్నారు. ముఖ్యఅతిథి రాజశేఖర్ మాట్లాడుతూ... క్రమశిక్షణతో శ్రద్ధగా చదువుకుని జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకున్న పలువురు పాల్గొన్న ఈ ఆత్మీయ సమ్మేళనంలో తాను ముఖ్యఅతిథిగా పాల్గొనడం గర్వంగా భావిస్తున్నట్లు తెలిపారు. అనంతరం తంగుటూరి రామకృష్ణ మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి తమ జీవితంలో లక్ష్యంతో ముందుకు సాగి పదిమందికి ఉపాధికి దారి చూపాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు అప్పట్లో సహ విద్యార్థులు ఉపాధ్యాయులతో ఉన్న అనుభవాలను పంచుకున్నారు.



అమెరికాలోని టెక్సస్ నగరంలో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, హ్యూస్టన్ తెలుగు సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యలో జరిగిన 14వ అమెరికా తెలుగుసాహితీ సదస్సులో పాల్గొన్న చెన్నైకి చెందిన క్రైస్తవ కళాశాల తెలుగుశాఖ అధ్యక్షుడు యజ్ఞశేఖర్, విశ్రాంత ఉపాధ్యాయిని డాక్టర్ శివకుమారి